క్లుప్తంగా

శుభ్రత పాటించాలి



చేబ్రోలులో డ్రెయిన్లు శుభ్రం చేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. చేబ్రోలులో డ్రెయిన్లు క్లీనింగు పనులు చేయించారు. సుప్రీం లోకల్ ట్రెనింగ్ సెంటర్ కార్యక్రమంలో భాగంగా శనివారం డ్రైనేజిల్లో సిల్ట్ తొలగించడం, రోడ్లు శుభ్రం చేయడం తదితర తొలగించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో డి ల్పివొ చంద్రశేఖర్, డిప్యుటి ఎంపిడివొ శ్రీనివాసు, సర్పంచ్ రందే లక్ష్మీసునీత పలువురు కార్యదర్శులు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేయాలి

ఏలూరు (టూటౌన్): ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు త్వరితగతిన నాణ్యమైన సేవలు అందించేందుకు సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు అంకిత భావంతో పనిచేయాలని శాశ్వత లోక్ అదాలత్ చైర్ పర్సన్ ఎ.మేరీ గ్రేస్ కుమారి పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో శాశ్వత లోక్ అదాలత్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల నాణ్యమైన సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మేరీ గ్రేస్ కుమారి మాట్లాడుతూ రవాణ, పోస్టల్, బ్యాంకింగ్, విద్య, వైద్య, ఇన్సూరెన్స్, రియల్ ఎస్టేట్, ఉపాధి హామీ, రియల్ ఎస్టేట్ మొదలైన సేవలలో లోపం జరిగిన శాశ్వత లోక్ అదాలత్‌లో సంప్రదించవచ్చని సూచించారు. కక్షిదారులు నేరుగా లేక పారా లీగల్ వలంటీర్ల ద్వారా కూడా అర్జీలను అందజేయవచ్చని, రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్ మాట్లాడుతూ జూలై 5న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని సూచించారు. సమస్యలను నేరుగా లేదా 15100 ద్వారా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవచ్చని అన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత



చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న ముత్తంగి గోపాలకృష్ణ

ఉంగుటూరు: కైకరం పెదిరెడ్డి వేణుగోపాల కృష్ణ ప్రసాదరావు, శేషవేణి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇప్పటి వరకు నేర్చుకున్న స్పోకెన్ ఇంగ్లీషు, చెస్, కంప్యూటర్ , అంశాలపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ ముత్తంగి వేణుగోపాల్, జిల్లా పరిషత్ హైస్కూలు హెచ్ఎం గుళ్ల ప్రసాదరావు, విజ్ఞాన భారతి స్కూలు ప్రిన్సిపాల్ ప్రశాంత్‌సాహో , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


యోగాతో ఒత్తిడి దూరం



సూర్య నమస్కారాలు చేస్తున్న దృశ్యం

నిడమర్రు: యోగాతో ఒత్తిడికి దూరంగా ఉంటే, ఏకాగ్రత పెరుగుతుందని ఎంపీడీవో విజయకుమారి అన్నారు. శనివారం ఎంపీడీవో సమావేశపు హల్‌లోజరిగిన యోగా తరగతులకు ఆయన ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయకుమారి మాట్లాడుతూ యోగా ప్రతి ఒక్కరు అలవరుచుకోవాలని సూచించారు. ఆయుర్వేదం ఆసుపత్రి మెడికల్ ఆఫీసరు జిజియా బాయ్ మాట్లాడుతూ యోగాసనాలు దిన చర్యగా ప్రతి ఒక్కరు అలవరుచుకోవాలన్నారు. యోగాతో ఎన్నో ప్రయోజనాలు చూకూరుతాయని అన్నారు. యోగా మాస్టర్‌ట్రైనర్ పి వి పెద్దిరాజు వజ్రాజనం, సూర్యనమస్కారాలు, శ్వాస తీసుకోవడం వదలంటం నేర్పారు. అంగన్‌వాడీకార్యకర్తలు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ



ఎంపీడీవో రాజ్‌మనోజు కైకరంలో పింఛన్ అందజేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో 90శాతం పింఛన్లు పంపిణీ చేయడం జరిగిందని ఎంపీడీవో రాజ్‌మనోజు విలేకర్లకు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాను సారం ఒకరోజు ముందుగా శనివారం పంపిణీ చేయడం జరిగిందన్నారు. 258,804 మంది పింఛన్లదారులకు 23,211 మందికి పంపిణీ చేయడం జరిగిందని మనోజు వివరించారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 5గంటులు వరకు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు.

పడకేసిన పల్లె వైద్యం



రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను 108 వాహనంలో తీసుకువెళ్తున్న దృశ్యం (ఫైల్)



గ్రామాల్లో 104 వాహనం ద్వారా వైద్య సేవలు(ఫైల్)

- ఇంటి వద్దకే వైద్య సేవలు ఏవీ?
- అల్లాడుతున్న దీర్ఘకాలిక రోగులు
- వైద్యశిబిరాలు నిల్

దెందులూరు: పేదల ఆరోగ్యానికి భరోసా లేదని అనారోగ్య సమస్యలతో ఆసుపత్రులకు వెళ్తుంటే పూర్తిస్థాయిలో వైద్యం అందని పరిస్థితులు దాపురించాయని ప్రజానీకం గగ్గోలు పెడుతున్నారు. వైద్యం ఉచితంగా అరకొరగా అందుతున్నా మందుల కొరతతో పాటు వైద్య పరీక్షలకు వేలాది రూపాయిలు కుమ్మరించాల్సి వస్తుందని రోగులు ఆరోపిస్తున్నారు. స్కానింగ్‌లు, ఎంఆర్‌ఐల రూపంలో వేలాది రూపాయిలు చెల్లించాల్సివస్తుందని వాపోతున్నారు. గతంలో ఎంతో ఉదారంగా అందే వైద్యసేవలు నేడు కుంటుపడే పరిస్థితి దాపురించిందని చెబుతున్నారు.

నిలిచిన ఆరోగ్య ఆసరా

ఆరోగ్య ఆసరా కార్యక్రమం ద్వారా వివిధ విభాగాల్లో శస్త్రచికిత్సలు చేయించుకుని డిశ్చార్జ్ అయ్యే సమయంలో ఆసరా ఎంతో అండగా ఉండేదని రోగులు చెబుతున్నారు. శస్త్రచికిత్స అనంతరం రోగి పౌష్టికాహారం తీసుకునేందుకు విశ్రాంతి సమయంలో రోజుకు రూ. 225 చొప్పున వైద్యులు నిర్దేశించిన కాలానికి నగదు రోగి తాలూకా బ్యాంకు ఖాతాకు జమయ్యేదని, ఇలా రూ. 5వేలు నుంచి రూ. 30వేలు వరకు రోగికి డబ్బు అందే వెసులుబాటు ఉండే పరిస్థితి గత ప్రభుత్వ హయాంలో ఉండేది. ఇందులో భాగంగా అత్యధికంగా న్యూరో కేసుల్లో వేలాది రూపాయిలు రోగికి డబ్బు అందడంతో వారి మందులు, ఇతర ఖర్చులకు ఆ మొత్తాన్ని వినియోగించే పరిస్థితి ఉండేది. కానీ నేటి కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గతేడాది ఆగస్టు నెల నుంచి ఈ ఆరోగ్య ఆసరా పథకాన్ని కూటమి ప్రభుత్వం నిలిపివేసింది. ఆరోగ్య మిత్రలు రోగుల నుంచి ధవపత్రాలు తీసుకుంటున్నా కానీ సొమ్ము మాత్రం వారి బ్యాంకు ఖాతాల్లో జమకావడంలేదని ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్సలకు ముందుగా చేయించుకున్న వైద్య పరీక్షల రిపోర్టులు అనగా స్కానింగ్ పరీక్షల తాలూకా మొత్తాన్ని కూడా చెల్లించే పరిస్థితి జగన్ ప్రభుత్వంలో ఉండగా నేడు ఆ సౌకర్యాన్ని కూడా తొలగించినట్లుగా రోగులు చెబుతున్నారు.

ఆరోగ్య ఆసరా బలోపేతం కావాలి



ఆరోగ్యశ్రీని కొనసాగించాలి. ప్రతి పేదవాడికి ఉచిత వైద్య సేవలను కూటమి ప్రభుత్వం అందజేయాలి. ఆరోగ్యశ్రీ సృష్టికర్త మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలు నూరు శాతం అమలు జరగాలి. ప్రతి పేదవాడికి సకాలంలో వైద్య పరీక్షలు సేవలు అందజేయాలి. – పోరా మురళి వైఎస్సార్‌సీపీ నేత

ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగించాలి



వైద్య సేవలు ప్రతి ఒక్కరికి అవసరం. ఆరోగ్యశ్రీ తో పాటు ప్రభుత్వ పథకాలు అమలు రాజకీయాలకు అతీతంగా అమలు జరగాలి. ప్రభుత్వ పథకాల అమలు తీరు ఆదర్శవంతంగా ఉండాలి. పేద బడుగు బలహీన వర్గాల ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు సకాలంలో అందజేయాలి. అప్పుడే బాపూజీ కలలు కన్నా స్వరాజ్యం సిద్ధిస్తుంది. – కొలుసు గణపతి రావు, మాజీ కోఆపరేటివ్ బ్యాంక్ ప్రెసిడెంట్

కులమతాలకు అతీతంగా మెలగాలి



కొమ్మరలో పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

గణపవరం: గ్రామంలోని ప్రజలంతా కుల,మత, వర్గబేధాలు లేకుండా ఐకమత్యంగా మెలగాలని, అప్పుడే గ్రామం ప్రశాంతంగా అభివృద్ధి బాటలో పయనిస్తుందని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానటరింగ్ సెల్ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. శనివారం జాతీయ పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా మండలంలోని గణపవరంలో సీవిల్ రైట్ దినోత్సవం నిర్వహించారు. ఈకార్యక్రమానికి మండల తహసీల్దార్ అప్పారావు అధ్యక్షత వహించారు. ఈకార్యక్రమంలో మంగరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ప్రాథమిక హక్కులు, బాధ్యతలు ఉంటాయని ముఖ్యంగా అణగారిన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ పట్ల వివక్ష చూపకుండా సోదరభావంతో ఉండాలని సూచించారు. కులవివక్ష చూపినవారికి చట్టంలో కఠిన శిక్షలు ఉన్నాయన్నారు. తహసీల్దార్ అప్పారావు మాట్లాడుతూ గ్రామంలో అన్నివర్గాల ప్రజలూ కలసి మెలసి ఉండాలని అప్పుడే గ్రామం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుర్లెళ్ల వెంకటరత్నం, ఎంపిడివో బేబీ శ్రీలక్ష్మి, ఎఎస్ఐ, విఆర్‌వో, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

ధూమపానం వద్దు.. ఆరోగ్యమే ముద్దు



దూమపాన వ్యతిరేక ప్రతిజ్ఞ చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

గణపవరం: ధూమపానం చేసే వ్యక్తితో పాటు తనచుట్టూ ఉన్న వ్యక్తుల ఆరోగ్యానికి కూడా చేటు చేస్తున్నారని, సమాజంలో ధూమపానం లేకుండా చూడటమే మనందరి లక్ష్యం కావాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు ఓంకార్‌నాథ్, పి.కిరణ్మయి అన్నారు. శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సి సిబ్బంది నోటుబాకోడే కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సి సిబ్బంది పొగాకు వ్యతిరేక ప్రతిజ్ఞ చేశారు. ధూమపానం వద్దు, ఆరోగ్యం ముద్దు, పొగతాగడం ఆరోగ్యానికి హానికరం, మత్తుపదార్థాలు వద్దు, పౌష్టికాహారం ముద్దు అంటూ నినాదాలు చేశారు. ధూమపానం వలన వచ్చే అనర్ధాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రదర్శన నిర్వహించి పొగాకు వ్యతిరేక నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి చౌక డిపోల్లో రేషన్ సరుకులు



తహసీల్దార్ బీ. సుమతి

దెందులూరు: జూన్ 1వ తేదీ నుంచి రేషన్ డిపోల్లో రేషన్ సరుకులను రేషన్ కార్డు దారులు తీసుకోవాలని దెందులూరు మండల తహసీల్దార్ బీ.సుమతి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జూన్ 1వ తేదీ నుంచి రేషన్‌కార్డు దారులకు రేషన్ సరుకులను రేషన్ చౌక డిపోల వద్దే అందిస్తున్నట్లు ,అందులో భాగంగా దెందులూరు మండలంలో ఉన్న రేషన్ కార్డు దారులు తమకు గతంలో కేటాయించిన రేషన్ చౌక డిపోల వద్దకు వెళ్లి ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల లోపు వెళ్లి రేషన్ సరుకులను తీసుకోవచ్చాన్నారు. 65 ఏళ్లు దాటిన వృద్ధులకు, వికలాంగులకు ఇంటివద్దే డీలర్లు వచ్చి సరుకులను అందజేస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలన్నారు. పంపిణీలో ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు వచ్చిన సహించేది లేదన్నారు. పూర్తిస్థాయి జవాబుదారీతో డీలర్లు పంపిణీ చేయాలని ప్రతి రేషన్ షాప్‌పై రెవెన్యూ శాఖ అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణ ఉంటుందన్నారు.

అధికారమే లక్ష్యంగా పనిచేయాలి



వాసుబాబును కలిసిన భీమడోలు వైఎస్సార్ సీపీ నాయకులు

గణపవరం: కల్లబొల్లి హామీలతో అధికారంలోకి వచ్చి, హామీలను తుంగలో తొక్కిన కూటమిపాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని వైఎస్సార్ సీపీ తిరిగి అధికారంలోకి రావడమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని వైఎస్సార్ సీపీ పీఏసి సభ్యుడు, మాజీ ఎంఎల్ఏ పుప్పాల వాసుబాబు అన్నారు. శనివారం రాత్రి భీమడోలు మండల నుంచి వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాలకు నూతనంగా నియమితులైన పలువురు వాసుబాబును క్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఉంగుటూరు నియోజకవర్గ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడిగా రామిశెట్టి శ్రీనివాస్, స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ విభాగం కార్యదర్శిగా ముళ్లగిరి జాన్సన్, స్టేట్ యూత్ విభాగం కార్యదర్శిగా మద్దుల రాజాలను నియమిస్తూ పార్టీ కేంద్రకార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు వారు మండల పార్టీ నాయకులతో కలసి వాసుబాబును కలిసి తమను పార్టీ పదవులలో నియమించినందుకు వాసుబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలోమండల పార్టీ కన్వీనర్ రాయపాటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, ఎంపిటిసి సభ్యుడు గంటా శ్రీను, పార్టీ నాయకులు పాము మాన్ సింగ్, అంబటి నాగేంద్ర, గొలుసుగోపి తదితరులు పాల్గొన్నారు.

గ్రేడ్ 2 ఏఎన్‌ఎంల ప్రమోషన్లలో అవకతవకలు

విచారణ చేయాలని యూనియన్ డిమాండ్

దెందులూరు: గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న గ్రేడ్ ప్రమోషన్లు జరిగాయని సచివాలయాల గ్రేడ్ 3 ఏఎన్ఎంల అసోసియేషన్ ఆరోపించింది. శనివారం దెందులూరులో యూనియన్ సభ్యులు మాట్లాడుతూ ప్రమోషన్ లిస్ట్ పారదర్శకంగా నిబంధనలు కనుగుణంగా జరగలేదన్నారు. రిజర్వేషన్ పాటించలేదని ఏజ్ రూలు చూడలేదన్నారు. సెకండ్ ఈయర్ మార్కులు కలిశాయో కలవలేదు తెలియటం లేదన్నారు. 18 ఏళ్లుగా వైద్య శాఖలో విధులు నిర్వహిస్తున్నామని నేటికి పదోన్నతి రాకపోవడం వెనుక అంతర్యేమేమిటని యూనియన్ నేతలు ప్రశ్నిస్తున్నారు. తమకంటే సీనియారిటీ తక్కువగా ఉన్న వారికి తమ తర్వాత ఉద్యోగంలో చేరిన వారికి ప్రమోషన్లు వచ్చాయని ఇది ఎలా సాధ్యపడుతుందని ప్రశ్నించారు. వికలాంగుల రిజర్వేషన్లు కూడా సక్రమంగా అమలు చేయలేదని నిబంధనలు పాటించలేదన్నారు. ప్రమోషన్ల విషయంలో అవకతవకలు జరిగాయని యూనియన్ తరఫున బాధితులు డీఎంఅండ్‌హెచ్‌ఓ జిల్లా కలెక్టర్ కార్యాలయాలకు వెళితే కలవనివ్వకపోవడం మరింత అనుమానాలకు తావిస్తోందన్నారు. వాస్తవాలు అవాస్తవాలు ఆరోపణలు నిజ నిజాలు తెలుసుకోవలసిన పని జిల్లా కలెక్టర్‌కు ఉందన్నారు. ఏళ్ల తరబడి సర్వీస్ చేసిన అర్హత ఉన్న తమను కాదని తమ తర్వాత చేరిన వారికి ఏ నిబంధన ప్రకారం ఏ సిఫారసు ప్రకారం పదోన్నతి కల్పిస్తారని తమకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆపేది లేదన్నారు. రిజర్వేషన్లు జరిగిన అవకతవకలను జిల్లా కలెక్టర్ రివెరిఫికేషన్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్‌కు డిఎంహెచ్‌ఓకు ప్రమోషన్లలో జరిగిన అవకతవకలు నిబంధనలు పాటించకపోవడంపై పొందుపరిచినత తదితరతో కూడిన పత్రాన్ని విలేకరులకు అందజేశారు. డీఎస్సీలో తక్కువ మార్కులు వచ్చిన వారికి ప్రమోషన్లు అవకాశం కల్పించారన్నారు. రాష్ట్ర విధానం ఎందుకు అమలు చేయలేదని ఇది వైద్య శాఖ నిబంధనలను అతిక్రమించడం కాదా అని ప్రశ్నించారు.

డీఎంఅండ్‌హెచ్‌ఓ మాలిని వివరణ

జిల్లాలో గ్రామ సచివాలయాల పనిచేస్తున్న గ్రేట్–3ఏఎన్ఎంలకు గ్రేడ్ ప్రమోషన్స్ విషయంలో అవకతవకల జరగలేదని నిబంధనలు పాటించామని జిల్లా కలెక్టర్ సమక్షంలో జరిగాయని వివరించారు.

కనీస వేతనాలు అమలు చేయాలి



సమావేశంలో పాల్గొన్న పంచాయతీ కార్మికులు

దెందులూరు: పంచాయతీ కార్మికులకు 010 పద్దు, ట్రెజరీ ద్వారా కనీస వేతనాలు అమలు చేయాలని ఏపీ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా కార్యదర్శి పి.కిషోర్, జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు డిమాండ్ చేశారు. శనివారం ఉదయం ఏలూరు రూరల్ మండలంలోని పలు గ్రామాల పంచాయతీ కార్మికులు ఏఐటీయూసీ సంఘంలో చేరిన సందర్భంగా చాటపర్రులో పంచాయతీ కార్మికుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పి కిషోర్, పుప్పాల కన్నబాబులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులకు 010 పద్దు, ట్రెజరీ పద్ధతిలో నెలనెల రెగ్యులర్‌గా జీతాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు, వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులకు సకాలంలో యూనిఫారం, సబ్బులు, చెప్పులు, కొబ్బరినూనె, రక్షణకు చేతి గ్లౌజులు అందజేయాలని కోరారు. ఈ సమావేశంలో మండలంలోని పలు గ్రామాలు పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదవేగి : ఈనెల 2న కూచింపూడి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్ కె ఎం అంబేడ్కర్ చెప్పారు. పెదవేగి మండలం పెదవేగి సెక్షన్ పరిధిలో ఉన్న 33/11 కేవీ కూచింపూడి సబ్‌స్టేషను పరిధిలో ఆర్‌డీఎస్ఎస్ పథకం పనుల నిమిత్తం ఈనెల 2 సోమవారం ఉదయం 09:00 గంటల నుంచి మధ్యాహ్నం 02:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయబడుతుందని, అందువల్ల కూచింపూడి సబ్ స్టేషన్ పరిధిలో గల కూచంపూడి, న్యాయంపల్లి, గోవిందరాజుగూడెం పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. కావున వినియోగదారులు గమనించి సహకరించాలని ఎఈ కోరారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు



భీమడోలులో పోటీల్లో విజేతలైన విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు తదితరులు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

భీమడోలు: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు వేదికలని మానవత స్వచ్చంధ సేవా సంస్థ జిల్లా డైరెక్టర్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్‌లు అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు శనివారం ఉల్లాసభరిత వాతావరణంలో జరిగాయి. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వారు చిన్నారులకు నీతి కథలను వివరించారు. సామూహిక పుస్తక పఠనం, సమీక్షలు రాసారు. అనంతరం స్వర్ణాంధ్ర 2047 అంశంపై క్విజ్ పోటీలను నిర్వహించారు. న్యాయనిర్ణేతగా మండే సుధాకర్ వ్యవహారించారు. అదే విధంగా ఇప్పటి వరకు జరిగిన పలు పోటీల్లో విజేతలైన వారిని వారు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల సమయం వృథా చేయకుండా వేసవి విజ్ఞాన తరగతులు ఎంతగానో దోహదపడతాయన్నారు. వ్యాసరచన, పుస్తక సమీక్షలు, గణితం, చిత్రలేఖనం తదితర పోటీల్లో చక్కని ప్రతిభను చాటిన వారిని అభినందించారు. విద్యార్థి దశ నుంచి గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునన్నారు. విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధిని సాధించేందుకు గ్రంథాలయాలు పునాదులుగా నిలుస్తాయన్నారు. ఈనెల 6వ తేదీన విద్యార్థులకు బహుమతులను అందిస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో గ్రంథపాలకులు కె.శ్రీనివాస్, డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, విద్యార్థులు, పెద్దలు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

దెందులూరు: మండలంలోని చాటపర్రు గ్రంథాలయంలో శనివారం గ్రంథపాలకులు వాసుకి పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు భాగంగా స్వర్ణాంధ్ర- 2047 అంశంపై జూనియర్, సీనియర్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించామని వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ముగిసిన తర్వాత విజేతలకు ప్రజాప్రతినిధులు అధికారులు చేత సర్టిఫికెట్లు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు.

వరిమోడులు తగులబెడితే నష్టం



డాక్టర్ కే ఫణి కుమార్

దెందులూరు: వరికోతల అనంతరం రైతులు మోడులను తగులబెడితే నష్టం అధికంగా ఉంటుందని ఏలూరు ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ కె. ఫణికుమార్ అన్నారు. శనివారం ఏలూరు రూరల్ మండలం పాలగూడెం, దెందులూరు మండలం దెందులూరు గ్రామాల్లో వ్యవసాయ పొలాలను పరిశీలించి రైతులను సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంటీయూ 1224, 1262 రకాలు రెండు సన్నగింజ రకాలన్నారు. తినటానికి అనుకూలంగా ఉంటాయని ఈ విత్తనాలు ఏలూరు ఏరువా కేంద్రంలో లభిస్తాయన్నారు. విత్తనాలు కావలసిన రైతులు 9989623804 ఫోన్ నెంబర్లు సంప్రదించాలని డాక్టర్ కె ఫణి కుమార్ సూచించారు.

ఎట్టకేలకు ఐరన్ తొలగింపు



భీమడోలులో ఐరన్‌ను ట్రాక్టర్లలో లోడ్ చేసి తరలిస్తున్న దృశ్యం

భీమడోలు: భీమడోలు హౌసింగ్ కార్యాలయం వద్ద నిరుపయోగంగా ఉన్న ఐరన్‌ను శనివారం హౌసింగ్ అధికారులు గోడౌన్‌కు తరలించారు. గుండుగొలను సచివాలయం 3 పరిధిలోని భోగాపురం వద్ద గల గోడౌన్‌లోని 15 టన్నులలోడ్ సుమారు రూ.20లక్షల విలువ గల ఐరన్‌ను తరలించి భద్రపర్చారు. గతంలో సాంకేతిక కారణాల రీత్యా గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఐరన్ పంపిణీ జరగలేదు. దీని వల్ల రెండేళ్లుగా కార్యాలయం వద్ద ఎండానక, వాననక, చలికి ఐరన్ తుప్పు పట్టింది. కార్యాలయం వద్ద షెడ్డు కూడా లేకపోవడంతో వాటిని భద్రపర్చకపోవడంతో నిరుపయోగకరంగా మారింది. తాజాగా గృహ నిర్మాణ సంస్థ లబ్ధిదారులకు చెందిన ఐరన్‌ను సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు అప్పగించాలని ఆ శాఖ రాష్ట్ర ఎండీ ఆదేశాలు జారీ చేసారు.ప్రస్తుతం ఇంటి స్థలాలిచ్చి ఇళ్లు నిర్మించే పరిస్థితి లేదని భావించిన అధికారులు వాటిని భద్రపర్చే పనిలో నిమగ్నమయాయరు. దీంతో భీమడోలులోని ఐరన్‌ను పదిమంది కూలీల సాయంతో నాలుగు ట్రాక్టర్లలో లోడు చేసుకుని భోగాపురం ఏరియాలోని గుడౌన్ లోకి తరలించారు. సచివాలయం 3లోని ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు వివిధ సైజ్ గల ఐరన్ రాడ్స్‌ను అప్పగించినట్లు ఏఈ చైతన్య తెలిపారు.

పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ



వైజాగ్‌లో జరిగిన వర్క్‌షాపుకు హాజరైన వైఎస్సార్ సీపీ సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్, గ్రామకార్యదర్శి, ప్రజాప్రతినిధులు

భీమడోలు: రాష్ట్రంలోని పంచాయతీలు ఆర్థిక స్వావలంబన సాధనపై వైజాగ్‌లో వర్క్‌షాపును శుక్రవారం రాత్రి వరకు నిర్వహించారు. ఒక్క రోజు జరిగిన ఈ వర్క్‌షాపుకు మండలంలో రూ.50లక్షల కన్నా ఎక్కువ ఆదాయం గల భీమడోలు, పూళ్ల, గుండుగొలను పంచాయతీల ప్రతినిధులు హాజరయ్యారు. భీమడోలు, పూళ్ల సర్పంచులు పాము సునీతామాన్‌సింగ్, దాయం సుజాత, గుండుగొలను గ్రామకార్యదర్శి తనూజలు హాజరై అక్కడ శిక్షణ పొందారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక కాబడిన పంచాయతీల నుంచి వచ్చిన సర్పంచ్‌లు, గ్రామకార్యదర్శులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. పంచాయతీరాజ్‌లోని ఎంపవర్మెంట్ కమిటి సభ్యులు వారికి శిక్షణ అందించారు. ఈ శిక్షణ ఎంతోగానో ఉపయోగపడుతుందని సర్పంచ్ పాము సునీతా మాన్‌సింగ్ శనివారం తెలిపారు.